క్లుప్తంగా

ప్రభాకర్ గుప్తా మృతికి ఎమ్మెల్యే నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : పట్టణంలోని జెట్టిపాలెంవీధికి చెందిన ప్రభాకర్ గుప్తా అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మృతుడి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే చింతల వెంట చింతల శివానంద రెడ్డి, కువైట్ శంకరాచారి, చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీలో సురక్షిత ప్రయాణం



లక్కీ డ్రా తీస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని ఆర్టీసీ-1 డీఎం మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బస్టాండులో మదనపల్లె-తంబళ్లపల్లె పాయింట్ లో లక్కీడిప్ తీశారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రయాణికుల మన్నలు పొంది ఆదాయం పెంచాలన్నారు. లక్కీ డ్రాలో మొదటి బహుమతి చిన్నపాపమ్మకు, రెండవ బహుమతి అమరనాథ్‌రెడ్డి, మూడవ బహుమతి శ్రీదేవికి దక్కినట్లు తెలిపారు. మదనపల్లె-బి.కొత్తకోట రూట్‌లో వచ్చే నెల 25న లక్కీ డ్రా తీస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి



టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ ఉషశ్రీ

పీలేరు : బిడ్డకు వ్యాధి లేని జీవనం సాధ్యపడాలంటే క్రమ తప్పకుండా టీకాలు వేయించాలని జిల్లా టీకాల నిర్వహణ అధికారి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. బుధవారం పీలేరు పట్టణంలోని ఒకటవ గ్రామ సచివాలయంలో టీకాల నిర్వహణ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు బిడ్డల జన్మహక్కు అన్నారు. వ్యాధి నిరోధక టీకాలపై తల్లులు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్‌ఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పీలేరు : స్థానిక ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించినట్లు కళాశాల చైర్మన్ అవినాష్‌రెడ్డి అన్నారు. బుధవారం మదనపల్లె, పీలేరు ప్రభుత్వాస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఫౌండర్ ఎం. వెంకటరమణారెడ్డి తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని 102 యూనిట్లు రక్తం దానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ఈశ్వర సురేంద్ర, డాక్టర్ నాగవేణి, డాక్టర్ మమత, డాక్టర్ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్‌చేసి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మండలంలోని కోటవారిపల్లె తాండాకు చెందిన బుక్కే మున్వేనాయక్(75) తన ఇంటివద్ద సారా విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకుని 20లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా బసినికొండ పంచాయతీ రామాచార్లపల్లెకు చెందిన ఆకుకుంట కన్నయ్య(52) తన ఇంటి సమీపంలో సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 1 0లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సారా విక్రేతల అరెస్టు

మదనపల్లె: అక్రమంగా సారా విక్రయాలు జరుగుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సిఐ వలి బాషు తెలిపారు. మంగళవారం అంకిశెట్టి పల్లి పంచాయతీ రామాపురంకు చెందిన హజరత్ రహింషా (42) గ్రామానికి సమీపంలో సారా విక్రయాలు చేస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి రూ. 3000 విలువచేసే 60 సారా ప్యాకెట్లు (15 లీటర్లు) స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశా మన్నారు. అలాగే పిట్టావాండ్లపల్లెలో సారా విక్రయిస్తున్న పారాసు వెంకటరమణ (65) వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు.

పుణ్యకార్యంలో సేవాతత్పరులు

- ఉచితంగా గంజి పంపిణీ
- ఉపవాసదీక్షాపరులకు రోజూ అందజేత



గంజి పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మదనపల్లె సిటీ : రంజాన్ ఉపవాసదీక్షల్లో గంజికి విశేష ప్రాధాన్యత ఉంది. ఉపవాస (రోజా) దీక్షాపరులకు గొంతెండుతున్న రోజంతా మంచినీరు ముట్టరు. కనీసం లాలజలం కూడా మింగరు. ఖాళీ కడుపుతోనే ఉపవాసం చేస్తారు. అంతలా నిష్టగా ఉంటారు. అయితే సాయంత్రం 6 గంటల తరువాత ఉపవాసం విరమించి తమకు ఇష్టమైన ఆహారంతోపాటు అధిక శక్తినిచ్చే పదార్థాలు తీసుకుంటారు. అధిక శక్తినిచ్చే పదార్థాల్లో గంజి కూడా ఒకటి. ఈ క్రమంలో మదనపల్లె పట్టణం బెంగళూరు బస్టాండు వద్దనున్న జామియా మసీదు వద్ద కొందరు సేవాభావంతో గంజి తయారీ చేసి ఉపవాస దీక్షపరులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

గంజి తాగితే శరీరంలో వేడి తగ్గుతుంది

దీక్షపరుల కోసం ఈ వంటకాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. గ్లాసు గంజి తాగితే శరీరంలో వేడి తగ్గుతుందని దీక్షాపరులు చెబుతున్నారు. బలవర్ధక ఆహారంగా పేరొందిన ఈ వంటకాన్ని మసీదుల్లోనే తయారు చేయడం విశేషం. ఉపవాసదీక్షపరులు విరమణ సమయంలో గంజి తాగేందుకు పోటీపడుతున్నారు. రంజాన్ నెల మొత్తం మసీదు వద్ద ఉపవాసదీక్షాపరులకు ముస్లింలు గంజి పంపిణీ చేస్తున్నారు. గంజి తయారీకి పలువురు ఆర్థిక సహాయం అందజేస్తారు. మసీదుల్లో రోజూ మధ్యాహ్నం 2 గంటల తర్వాత గంజి తయారీని ప్రారంభిస్తారు. సాయంత్రం 4.30 గంటల నుంచి పంపిణీ చేస్తారు. సాయంత్రం 6.30 వరకు ఈ గంజిని సిద్ధం చేసి ఇఫ్తార్‌లో పాల్గొన్న దీక్షా పరులకు అందజేస్తారు.

తయారీ ఇలా...

బియ్యం రవ్వ లేదా బొంబాయి రవ్వ, ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, టమటా, కొత్తిమీర, పుదీనా, కరివేపాకు, పచ్చిమిర్చి, వేరుశనగలు, లవంగాలు, యాలకులు, చెక్క, నూనె, నెయ్యి ఉపయోగించి గంజి తయారు చేస్తారు. సాయంత్రం నమాజ్ తరువాత ఉపవాసదీక్షపరులకు పంపిణీ చేస్తారు. నిర్వాహకులు మసీదుల్లో గిన్నెల్లో పోసి ప్రార్థనకు వచ్చిన వారికి అందిస్తారు.

గంజి అధిక శక్తినిస్తుంది



ఇస్లాం మతంలో రంజాన్ మాసానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. దాదాపు 29 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. 30 రోజుల పాటు చిన్నా,పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఉపవాసదీక్షలు చేస్తారు. దీక్ష విరమణ అనంతరం అలసట రాకుండా తొలుత అధిక శక్తి నిచ్చే గంజిని సేవిస్తారు. సుమారు వెయ్యి మంది నుంచి 1500 మంది ఉపవాసదీక్షపరులకు ఉచితంగా గంజిని పంపిణీ చేస్తున్నారు.

– రఫీక్‌బేగ్, మతపెద్ద, మదనపల్లె

సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి విజయ సోపానాలు



ఎన్నికల ప్రచారంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

కేవీపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి విజయసోపానాలు అని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మహల్‌రాజుపల్లె గ్రామ పంచాయతీలో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాము ఏ ఇంటి వద్దకు వెళ్లినా అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్ని విధాలా లబ్ధిపొందామని, తమ మద్దతు వైఎస్సార్‌సీపీకేనని చెబుతున్నారని చెప్పారు. రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డి మరోసారి విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, సర్పంచ్ నీలావతి, వైస్ ఎంపీపీ హరిబాబు, నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, పొత్తపు సతీష్‌రెడ్డి, లక్షుమురెడ్డి, గుర్రం భాను, వంశీకిషన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రమణారెడ్డి, హేమంత్, సుధాకర్, రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు రూరల్ : పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం తలపుల పీహెచ్‌సీ పరిధిలోని కావలిపల్లె గ్రామ సచివాలయంలో వడదెబ్బ - శిశుసంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. పాలిచ్చు తల్లి వడదెబ్బకు గురికాకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనైతిక కూటమితో ముస్లింల మనుగడ ప్రశ్నార్థకం

రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్



కలికిరిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్

కలికిరి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అనైతిక కూటమి టీడీపీ, బీజేపీ, జనసేన లకు ఓటు వేస్తే ముస్లింల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన కలికిరి పట్టణ పరిధిలోని కొత్తపేటవీధి, మెయిన్ బజారు, జంగంపల్లివీధి, పాతబస్టాండ్, ఆర్.ఎస్.రోడ్డు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మతతత్వ పార్టీ బీజేపీతో పొత్తుపెట్టుకున్న తెలుగుదేశం రాష్ట్రంలో ముస్లింల ప్రయోజనాలను గాలికి వదిలేసిందన్నారు. ముస్లింలకున్న నాలుగు శాతం రిజర్వేషన్‌లు కూడా రద్దు చేయనున్నట్లు స్వయంగా బీజేపీ నేత, కేంద్ర హోంమంత్రి ప్రకటించారని, అయినా తన స్వార్థం కోసం టీడీపీ అధ్యక్షుడు పొత్తుపెట్టుకోవడం దారుణమన్నారు. ముస్లింలు ఏకతాటిపై నిలిచి అనైతిక కూటమికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కుల, మత, రాజకీయాలతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుడే పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి ఓటు వేసి మరోసారి గెలిపించాలని ఆయన ఇంటింటా కోరారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీకర్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, తస్లీమారియాజ్, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటి చైర్మన్ సతీష్‌రెడ్డి, ఎస్టీడి హరి, ఎంఐ హనీఫ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతను మరోమారు గెలిపించుకుందాం

చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప



ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, చింతల సాయిక్రిష్ణారెడ్డి

వాల్మీకిపురం : సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి గెలిపించుకోవాలని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీపేటలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయిక్రిష్ణారెడ్డితో కలసి ఎంపీ రెడ్డెప్ప ఇంటింటి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో సంక్షేమాన్ని, అభివృద్ధిని అందించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుంచిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో నూటికి 9 8శాతం హామీలను అమలు చేశామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి రెండేళ్లలో కరోనాతో ఇబ్బందులను ఎదుర్కొన్నా అభివృద్ధి, సంక్షేమాన్ని ఎక్కడా విస్మరించలేదన్నారు. ప్రజా సంక్షేమ పాలనను అందించిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డి దేనని సామాజిక, న్యాయానికి పెద్దపీట వేసిన ఘనత కూడా ఆయనదేనన్నారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పాలన అందించిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చేసేందుకు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి ప్రజలు మరోసారి అవకాశం ఇవ్వాలని, ప్రతి ఓటరు ఫ్యాన్ గుర్తుపై ఎంపీ, ఎమ్మెల్యేలకు రెండు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో కేశవ రెడ్డి, రఘు, సుధాకర్, రవి, సాగుబడి ఆనంద రెడ్డి, శివారెడ్డి, జగదీష్, ఉదయ్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై శ్రీలక్ష్మీనారసింహుడు



స్వామివారికి స్నపన తిరుమంజనం



గజవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి గజవాహనంపై విహరించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవరోజైన బుధవారం ఉదయాన్నే మూలవర్లకు తోమాలసేవ ఘనంగా నిర్వహించారు. ఆలయంలో తిరుచ్చి ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. స్వామి వారి తిరుచ్చి వాహనంలో స్వామి వారిని కొలువు దీరి మేళ తాళాలతో, నాట్య కళాబృందాల సాంస్కృతి కార్యక్రమాలతో ఊరేగింపు రంగరంగ వైభవంగా సాగింది. ఆలయంలో స్వామి మండపంలో స్వామివారికి స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. సాయంకాలం స్వామివారిని గజవాహనంపై కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించి గ్రామ పుర వీధుల్లో స్వామివారిని ఊరేంచారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు కల్యాణోత్సవం:

తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం గురువారం నిర్వహించనున్నారు. సాయంకాలం సర్వభూపాల వాహనం, రాత్రి స్వామివారి కల్యాణోత్సం, అనంతరం గరుడవాహనంపై స్వామివారు ఊరేగనున్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ నరసింహారెడ్డి



మేము సిద్ధం- మా బూత్ సిద్ధం కార్యక్రమంలో నరసింహారెడ్డి తదితరులు

పీలేరు : వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ నరసింహారెడ్డి, పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఇంటింటికీ వెళ్లి గుర్తు చేయాలన్నారు. అభివృద్ధిని ఆకాంక్షిస్తూ మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ, ఆనంద్, చైతన్యరెడ్డి, మునీర్, కాలనీ చిన్న, గిరిధర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, పెద్దోడు, షాకీర్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను వేధింపులకు గురిచేసిన ఆ టీచర్ వద్దు



నిరసన తెలియజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మదనపల్లె సిటీ : పిల్లలను పలు రకాల వేధింపులకు గురి చేసిన టీచర్ మాకు వద్దంటూ బుధవారం మదనపల్లె మండలం బాలాజీనగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. పాఠశాల గేటు వద్ద బైఠాయించి నిరసన తెలియజేశారు. గతంలో ఇదే పాఠశాలలో పనిచేసిన మ్యాథ్స్ టీచర్ నజహత్ నఫీషా వ్యవహార శైలిపై ఆందోళనలు చేయడంతో సస్పెండ్ చేశారు. తిరిగి అదే పాఠశాలకు టీచర్‌గా ఆర్డర్స్ రావడంతో పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ విషయంపై పాఠశాల హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. ఆమె తిరిగి పాఠశాలలో విధుల్లో చేర్చుకుంటే విద్యార్థులను పాఠశాలకు పంపమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే ఆందోళనలు తప్పవమన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ మున్వర్‌బాషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచితంగా 104 వైద్య సేవలు



వైద్యసేవలను తనిఖీ చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కలకడ : జిల్లాలో నిర్దేశించిన గ్రామాల్లో కేటాయించిన సమయంలో 104 ఉచిత వైద్య సేవలను అందించాలని జిల్లా 104 ఎగ్జిక్యూటీవ్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం మండలంలోని రంగప్పగారిపల్లె గ్రామంలో ఎర్రకోటపల్లె పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అందిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను తనిఖీ చేశారు. చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత టీకాలు, 50 సంవత్సరాలు పైబడిన వారికి ఉచితంగా 104లో చేసే బీపీ, షుగర్, రక్తపరీక్షలతో పాటు గర్భిణులకు ఇచ్చే మందులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 135 మందికి ఉచిత వైద్యసేవలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మ, సిబ్బంది శ్రీలక్ష్మి, ఆశవర్కర్లు, పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద నిఘా ముమ్మరం

పెద్దతిప్పసముద్రం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్ సిబ్బంది సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా ముమ్మరం చేయాలని ట్రైనీ డీఎస్పీ జీఎస్ ప్రశాంత్ స్థానిక ఎస్ఐ రవీంద్రబాబును ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో గొడవలకు ప్రేరేపించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రజలంతా నిర్భయంగా ఓటు వేసేలా, పోలీసులపై ప్రజలకు నమ్మకం కలిగేలా అవగాహన కల్పించాలన్నారు.

గంజాయి స్వాధీనం

కురబలకోట : ముదివేడు గ్రామం సాయుబులపల్లెలో ఓ చెట్టు కింద గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి షేక్ మహబూబ్‌సాహెబ్ (46)ను బుధవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఏడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అంగళ్లులో పోలీసు బలగాలు



కురబలకోటలో కేంద్ర బలగాలు కవాతు

కురబలకోట : సార్వత్రిక ఎన్నికల్లో నియోజక వర్గంలో కురబలకోట మండలంలోని అంగళ్లు కీలకంగా మారింది. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇప్పటికే ఈవీఎం స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేశారు. ఇక్కడి నుండే నియోజక వర్గంలోని పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలు పంపుతారు. అదే విధంగా కేంద్ర బలగాలు కూడా అంగళ్లు కేంద్రంగా పనిచేస్తున్నాయి. ఇవి సబ్ డివిజన్ పరిధిలో భద్రతను పర్యవేక్షిస్తాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా చూస్తారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇవి అంగళ్లు కేంద్రంగా పనిచేస్తాయి. అంతేగాకుండా అంగళ్లులో తనిఖీలకు చెక్ పోస్టును కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఈఎన్నికల్లో నియోజక వర్గంలో అంగళ్లు కీలకంగా మారుతోందన్న విషయం స్పష్టమవుతోంది.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి



ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ

కలకడ : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రియదర్శిని, సీఐ శ్రీనివాసులు అన్నారు. బుధవారం కలకడ వెలుగు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేటికి ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందని, 18 సంవతంసరాలు నిండిన యువతీ యువకులు వెంటనే నమోదు చేసుకుని నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి, ఎంపీఎం రమేష్, అంగన్‌వాడి సూపర్‌వైజర్లు యశోధరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై వేంకటరమణుడు



రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరులో వెలసిన శ్రీగట్టు వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి సూర్యప్రభ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని మేళతాళాలతో, చక్కభజనలు, కోలాటాలతో పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. హాజరైన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు : డీఎస్పీ

నిమ్మనపల్లి : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు మదనపల్లి డీఎస్పి ప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రూరల్ సర్కిల్ సీఐ సద్గురుడు, స్థానిక ఎస్ఐ లోకేష్ రెడ్డి, కేంద్ర సీఆర్పిఎఫ్ బలగాలతో కలిసి పోలీస్ స్టేషన్ నుంచి వెంకోజిగారి పల్లి, నిమ్మనపల్లి, పాత బస్టాండు, తవళం క్రాసు, పెద్దమాదిగ పల్లె వరకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు.